RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 259 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 23 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## వేడి పుట్టిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావు, మేయర్ విజయలక్ష్మితో దీపాదాస్ మున్షీ భేటీ

# కేసీఆర్‌కు షాక్ తప్పదా?



## కాంగ్రెస్‌లో చేరిక లాంఛనమేనా!? రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం!!

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల ముందు కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు, నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా, మరో బీఆర్ఎస్ కీలక నేత, కేసీఆర్ సన్నిహితుడు కే కేశవరావు పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు సమాచారం. శుక్రవారం బీఆర్ఎస్‌సీనియర్ నేత కే కేశవరావుతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దీపాదాస్ మున్షీ భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని కేకే నివాసానికి దీపాదాస్ మున్షీ పాటు ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి వెళ్లారు.


దాదాపు 40 నిమిషాల పాటు తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ కూడా ఉన్నారు. వీరిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు సాగుతున్న సమయంలో కేకేను కాంగ్రెస్ నేతలు కలవడం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలను చూస్తే.. బీఆర్ఎస్ నాయకుల కాంగ్రెస్ చేరికలు ముమ్మరమయ్యా యని చెప్పొచ్చు. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్ సునీతా మహేందర్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ టికెట్లు కూడా దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలోనే కేకే, విజయలక్ష్మి కాంగ్రెస్ నేతలతో కలిసి చర్చించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వీరిద్దరూ పార్టీ మారే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిన కేశవరావు, ఇప్పుడు తిరిగి సొంత గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అయితే తాను పార్టీ మారడం లేదని కేకే చెప్పడం గమనార్హం. అయితే, త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని మేయర్ విజయలక్ష్మి చెప్పారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తరఫున పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు సహా లోక్?సభ ఎన్నికల్లో సీటు ఆశించి భంగపడ్డ నేతలంతా ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తున్నారు. ఇప్పటికే శానంపూడి సైదిరెడ్డి, ఆరూరి రమేశ్‌వంటి నేతలు బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ గూటికి చేరిపోయారు. మరికొంత మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌నేతలు సైతం ఇతర పార్టీల్లోని ముఖ్య నేతలను తమ పార్టీలోకి ఆహ్వానిస్తుండటం గమనార్హం.

# సుప్రీంలో కవితకు ఎదురుదెబ్బ

## బెయిల్ ఇవ్వలేం.. ట్రయల్ కోర్టుకు వెళ్లండి: కవితకు సుప్రీం సూచన




ఢిల్లీ: సుప్రీంకోర్టు లో ఎమ్మెల్సీ కవితకు ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సుప్రీం ధర్మాసనం సూచించింది. తన అరెస్ట్ చట్టవిరుద్ధమంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణ నిర్వహించింది. రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించి కవిత లేవనెత్తిన అంశాలను గతంలో విజయ్ మదన్ లాల్ కేసుకు సుప్రీం ధర్మాసనం జత చేసింది. రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలను మాత్రమే విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. బెయిల్ తాము ఇవ్వలేమని, ఎవరైనా కింది కోర్టును మొదట ఆశ్రయించాల్సిందేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. 6 వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచించింది. బెయిల్ తాము ఇవ్వలేమని, ఎవరైనా కింది కోర్టును మొదట ఆశ్రయించాల్సిందేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. కవిత కేసు జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. కవిత తరపున కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కాగా.. ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ కవిత పిటిషన్ దాఖలు చేశారు. క్రిమినల్ ప్రొసీడింగ్స్ క్వాష్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిగింది. ఇదే కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను సైతం ఈడీ అరెస్టు చేసింది. కేజ్రీవాల్ అరెస్ట్ పై అత్యవసర విచారణకి సుప్రీంకోర్టు అంగీకరించింది.



## ఇద్దరు ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్

తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా గులాబీ జెండా పాతాల్సిందేనని భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు వ్యూహ రచన చేస్తున్నారు. ఓ వైపు సిట్టింగ్ ఎంపీలు.. మరోవైపు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కారు దిగి హస్తం, కాషాయ గూటికి వెళ్లిపోతున్న పరిస్థితి. దీంతో అభ్యర్థుల దొరక్క బీఆర్ఎస్ నానా తిప్పలు పడాల్సి వచ్చింది. దీంతో ఎమ్మెల్యేలుగా ఓడిన, మాజీ మంత్రులను.. ఇతర పార్టీల నుంచి వచ్చిన.. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు ఆశించి భంగపడిన నేతలకు టికెట్లు ఇచ్చే పనిలో బీఆర్ఎస్ నిమగ్నమైంది. ఇప్పటికే పలువురు ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్.. తాజాగా మరో రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. **ఇదిగో ఈ రెండు స్థానాలే..** నాగర్ కర్నూల్ : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ (మాజీ ఐపీఎస్ అధికారి), మెదక్ : వెంకట్రామిరెడ్డి (మాజీ ఐఏఎస్ అధికారి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ).




# కక్ష సాధింపేనా..?

లోక్ సభ ఎన్నికల ముందు ప్రధాన ప్రతిపక్షాలను దెబ్బకొట్టే రీతిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శలు చెలరేగుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను ఆదాయపన్ను (ఐటీ) శాఖ స్తంభింపచేయడం, మరోవైపు ప్రతిపక్ష పార్టీల నేతలయిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ను మద్యం కుంభకోణంలో అరెస్టు చేయడం ఇందుకు ఉదాహరణ అని అంటున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం ఎప్పుడో బయటపడ్డా.. ఇన్నాళ్లూ పట్టించుకోనట్టుగా ఉండి.. ఎన్నికల ముందు ఆయా పార్టీల్లో పెద్ద తలకాయలను అరెస్టు చేయడాన్ని బీజేపీ ఎత్తుగడగా భావిస్తున్నారు. తెలంగాణలో లోక్ సభ ఎన్నికల్లో కేసీఆర్ ప్రచారం చేయకుండా చేతులు కట్టేయడం, ఆయన నైతిక స్థైర్యాని దెబ్బకొట్టడం, ఆయన పార్టీకి చెందిన నేతలను బీజేపీలోకి చేర్చుకోవడమే కవిత అరెస్టు లక్ష్యమంటున్నారు. అదేవిధంగా ఆమ్ ఆద్మీ పార్టీ.. ఢిల్లీ, పంజాబ్ ల్లో అధికారంలో ఉంది. అంతేకాకుండా హరియాణా, గుజరాత్ ల్లోనూ బాగానే విస్తరించింది. ఈ నేపథ్యంలో వచ్చే లోక్ సభ ఎన్నికల్లో పంజాబ్ లో అన్ని స్థానాల్లో ఆప్ పోటీ చేస్తోంది. ఢిల్లీ, హరియాణా, గుజరాత్ ల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని బరిలోకి



దిగుతోంది. ఈసారి ఆప్ ఈ రాష్ట్రాల్లో మంచి ఫలితాలు సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఆప్ కు ప్రధాన నేత ఇప్పటికీ అరవింద్ కేజ్రీవాల్ ఒక్కరే. ఆయనను అరెస్టు చేసిన నేపథ్యంలో ఆ పార్టీ తరఫున ప్రచారం చేయడానికి నెంబర్ టూ అనదగ్గ నేతలెవరూ లేరు. గతంలో మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్ వంటి వారు ఉండేవారు. అయితే వారిద్దరూ ఇప్పటికే జైలుపాలయ్యారు. జైల్లోనే ఉన్నారు. దీంతో ఆప్ రెక్కలు తెగిన పక్షిలా మారింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి వస్తున్న విరాళాల్లో లెక్కలు లేవని, ఆదాయపన్ను (ఐటీ) కట్టలేదని ఐటీ శాఖ కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను కొద్దిరోజుల క్రితం స్తంభింపజేసింది. దీంతో తాము దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి విమాన టికెట్లు బుక్ చేసుకోవడానికి తమ వద్ద డబ్బుల్లేవని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నిర్వేదం వ్యక్తం చేశారు. కనీసం రైలు టికెట్లు కూడా బుక్ చేయలేని స్థితిలో ఉన్నామని ఆవేదన చెందారు. రూ. 2 కూడా ఖర్చు పెట్టలేని స్థితిలో ఉన్నామని సాక్షాత్తూ సోనియాగాంధీ వాపోయారు. ఎన్నికల ముందు తమను దెబ్బతీయడమే లక్ష్యంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఆదాయ పన్ను శాఖ (ఐటీ) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి జేబు సంస్థలుగా మారాయిని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఆ విమర్శలకు తగ్గట్టే ఈ సంస్థలు వ్యవహరిస్తున్నాయని అంటున్నారు. కేవలం ప్రతిపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకుంటూ ఎన్డీయే కూటమిలోని నేతల జోలికి వెళ్లడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ఎక్కడ చూసినా సీబీఐ, ఈడీ వేధింపులు ఎక్కువయ్యాయని టాక్ నడుస్తోంది. మరోవైపు పక్కా ఆధారాలతోనే ఈడీ, సీబీఐ నిందితులను అరెస్టు చేస్తున్నాయని అంటున్నారు. అరెస్టు అయిన నేతలకు కోర్టుల్లో సైతం ఊరడింపు దక్కడం లేదని, అవినీతికి ఆధారాలుండటం వల్లే ఇలా జరుగుతుందని చెబుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ముఖ్యమంత్రుల కుటుంబ సభ్యులు అడ్డగోలు అవినీతికి పాల్పడ్డారని పేర్కొంటున్నారు. ఇందుకు కేసీఆర్ కూతురు కవిత ఉదంతమే నిదర్శనమని చెబుతున్నారు. ఇంకోవైపు కేజ్రీవాల్ రూ. 100 కోట్లకు లొంగుతాడా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఇది గ్యారెంటీగా కక్ష సాధింపు అని ఆరోపిస్తున్నారు. కవిత మీద చాలా ఆరోపణలు ఉన్నాయని.. అయితే కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలపైన చాలా తక్కువ సందేహాలున్నాయని అభిప్రాయపడుతున్నారు. అయితే ఖచ్చితంగా లోక్ సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడ్డాక ఈ అరెస్టులు జరుగుతుండటంతో ఎన్నికల్లో ప్రతిపక్షాలను దెబ్బతీసే లక్ష్యం, మిగతా నేతలను భయపెట్టే ఉద్దేశం ఉందని అంటున్నారు.

## కవిత, కేజ్రీవాల్ అరెస్టుల వెనుక మోడీ - షా హస్తం ఉందా!?

## సంపాదకీయం

ప్రభాత సమాచారం తెలంగాణ తెలుగు దినపత్రిక

# బెంగళూరులో రోజుకు నీటి ఖర్చు రూ.500?

వాతావరణ పరిస్థితులు ఒకవైపు.. మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి బెంగళూరు మహానగరంలో బతుకుతున్న లక్షలాది మందికి జీవితం దుర్భరంగా మారింది. తాగునీటి కష్టాలతో వారు విలవిలలాడిపోతున్నారు. గడిచిన కొద్ది నెలలుగా నీటి కష్టాలు ఎక్కువ కావటం.. ఇప్పుడు తీవ్రమైన పరిస్థితి. బెంగళూరు ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలు సినిమా కష్టాలకు మించి ఉంటున్నాయి. పొద్దున్నే లేచింది మొదలు ఆ రోజు అవసరాలకు సరిపడా నీళ్లను సొంతం చేసుకోవటం ఇప్పుడో పెద్ద సమస్యగా మారింది. ఈ నీటి కష్టాల్ని ఎదుర్కోలేని వారు పెద్ద సంఖ్యలో బెంగళూరు మహానగరాన్ని వదిలిపెట్టి.. సొంతూర్లకు వెళుతున్నారు. ఉద్యోగాల్ని వర్కు ఫ్రం హెూం అడిగి తీసుకుంటున్నారు. ఈ గార్డెన్ సిటీలో ఐటీ ఉద్యోగం చేస్తున్న వారి కష్టాలు అన్ని ఇన్ని కావు. ఇప్పటికే బెంగళూరులో నీటికి సంబంధించి బోలెడెన్ని రూల్స్ ఇప్పుడు అమలవుతున్నాయి. నీటిని ఏ మాత్రం వేస్టు చేసినా కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే నీటి వినియోగంపై పెద్ద ఎత్తున ఆంక్షలు అమలవుతున్నాయి. నీళ్ల ట్యాంకర్లను బుక్ చేస్తే ఎన్నిరోజులకు వస్తాయో అర్థం కాని పరిస్థితి. ఇలాంటివేళ.. కొన్ని కుటుంబాల వారు రోజుకు రూ.500 ఖర్చు చేస్తే తప్పించి బెంగళూరు నీటి కష్టాలనుంచి బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. అంతేకాదు.. అనేక అపార్టుమెంట్లలో నీటి రేషన్ ను కఠినంగా అమలు చేస్తున్నారు. నీటి కోసం 25 లీటర్ల వాటర్ బాటిళ్లను చేతబట్టిన పలువురు ఆర్ వో కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. బెంగళూరు నీటి కష్టాల ఎపిసోడ్ లో సిద్దరామయ్య సర్కారుకు భారీ డ్యామేజ్ జరిగిన పరిస్థితి. ఇదిలా ఉంటే.. తాగునీటి కొరత అంశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య.. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ లు పూర్తిగా ట్యాంకర్ల మాఫియాకు లొంగిపోయారంటూ రాజకీయ ప్రత్యర్థులు పెద్ద ఎత్తున విమర్శలకు దిగుతున్నారు.

మిగిలిన సంగతులు ఎలా ఉన్నా.. నీటి కోసం బెంగళూరు సామాన్యులు పడుతున్న కష్టాలు అన్ని ఇన్ని కావు. జూన్ వర్షాలు పడే వరకు ఈ తిప్పలు తప్పని పరిస్థితి.

# నీటి పొదుపు.. కష్టాల అదుపు



హైదరాబాద్: వేసవి కాలం ప్రారంభంలోనే నగర వాసులు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. భాగ్యనగరంలో కోటికి పైగా ఉన్న జనాభా నీటి అవసరాలు తీర్చేందుకు జలమండలి అధికారులు అవస్థలు పడుతున్నారు. నీటి వినియోగంలో జగ్రత్తలు పాటించకపోతే సంక్షోభం ఎదుర్కోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బెంగళూరులో ఆంక్షలు ఇలా.. నీటి వృథాను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం బెంగళూరులో పలు ఆంక్షలు అమలు చేస్తోంది. అవసరానికి మించి నీటిని ఉపయోగిస్తే రూ.5000 జరిమానా విధిస్తోంది. రోజువారీ నీటి వాడకంలో 20 శాతం తగ్గించుకోవాలని లేకపోతే అదనంగా వాటర్ ఛార్జీలు విధిస్తామని హెచ్చరికలు జారీ అయ్యాయి. తినడానికి పేపర్ ప్లేట్లు ఉపయోగించాలని, వాహనాల సర్వీసింగ్ చేయించుకోవడం తగ్గించుకోవాలని పేర్కొంది. ఈత కొలనుల్లో నీటిని నింపొద్దని సూచించింది.

20 శాతం నీరు వృథా.. నగరంలో రోజు విడిచి రోజు 2,547 మిలియన్ల లీటర్ల నీటిని అందిస్తుండగా.. దీనిలో 20 శాతం అంటే 509 మిలియన్ల లీటర్ల నీరు వృథా అవుతున్నట్లు గతంలో జలమండలి పరిశీలనలో స్పష్టమైంది. పాత పైపులైన్ల వ్యవస్థ లీకేజీలు, చాలా కుళాయిలకు మూతలు లేకపోవడం నీటి వృథాకు ప్రధాన కారణం. ఇటీవల ఉస్మాన్‌సాగర్ జలాశయం నుంచి నగరానికి నీటి సరఫరా చేసే లైన్‌కు హకీంపేట వద్ద లీకేజీ ఏర్పడింది.

స్వీయ నియంత్రణ అవసరం.. నీటి పొదుపులో స్వీయ నియంత్రణ అవసరం. ఇతర పనుల్లో నిమగ్నమై నల్లా నీటిని వదిలి మరిచిపోవద్దు. ట్యాంకుల్లో నీరు నిండగానే బోరు ఆపాలి. వీలైనంత వరకు వేసవిలో వాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేయించకూడదు. శుభకార్యాల్లో తప్పనిసరిగా నీటి పొదుపునకు ప్రాధాన్యమివ్వాలి. వాన నీరు భూమిలోకి చేరేలా పార్కులు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలి.

నగరంలో నీటి సరఫరా వ్యవస్థ..

మొత్తం పైపులైన్లు: 10 వేల కి.మీ.

మొత్తం నల్లాలు: 13 లక్షలు

రోజు విడిచి రోజు వ్యక్తికి ఇచ్చే నీరు: 150 లీటర్లు

# ఈ హత్యల మిస్టరీ వీడేదెప్పుడు..?



హైదరాబాద్: నగరంలో కొన్ని హత్య కేసుల మిస్టరీ నెలల తరబడి కొనసాగుతోంది. హత్యలని వెల్లడైనా మృతులెవరో.. వారిని హత్య చేసిందెవరో అంతుచిక్కలేదు. ఈ ఏడాదిలో ప్రారంభంలో రెండు కేసులే ఇందుకు ఉదాహరణ. ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి ఔటర్ రింగురోడ్డు సమీపంలో గోనె సంచిలో మృతదేహం లభ్యం, సూరారం ఠాణా పరిధిలో మహిళ మరణం వెనుక కారణాలేమిటో తేలలేదు. ఆదిభట్ల ఠాణా పరిధిలో గతంలో తల లేని మృతదేహం లభ్యమైంది. ఈ కేసు దర్యాప్తు సుదీర్ఘంగా కొనసాగుతూనే ఉంది. నగరంలో ఏటా కొన్ని హత్య కేసులు మిస్టరీలుగానే మిగిలిపోతున్నాయి. నిందితులు మాత్రం దర్జాగా తప్పించుకు తిరుగుతున్నారు.

నిర్మానుష్య ప్రాంతాల్లో హత్య.. సాంకేతిక ఆధారాలు లేకపోవడం, ఇతర ప్రాంతాల్లో చంపేసి మృతదేహాల్ని మరో ప్రాంతంలో విసిరేయడం వల్ల కొన్ని కేసుల్లో దర్యాప్తు ముందుకుసాగడం లేదని పోలీసు అధికారులు తెలిపారు. ఏదైనా ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం వెలుగుచూసినప్పుడు.. 174 సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు. మృతుల ఫొటోలు సేకరించి.. ఇతర ప్రాంతాల్లో అదృశ్యమైన కేసులతో పోల్చి ఆచూకీ కనిపెట్టేందుకు ప్రయత్నిస్తారు. అదృశ్యమైన కేసుల్లో వ్యక్తులతో ఏ మాత్రం పోలికలు సరిపోయినా సమాచారం ఇస్తారు. నాలుగైదు రోజుల తర్వాత బల్దియా సిబ్బంది అంత్యక్రియలు నిర్వహిస్తారు. మృతదేహం లభ్యమైనప్పుడు హత్య జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు వెలుగుచూస్తే హత్య కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. ఈ తరహా కేసుల్లోనే దర్యాప్తు సుదీర్ఘంగా కొనసాగుతోంది. నగర శివార్లలో సీసీ కెమెరాలు లేని నిర్మానుష్య ప్రాంతాల్లో మృతదేహాలు విసిరేయడం, నిందితులు ప్రాథమిక ఆధారాలు లేకుండా జాగ్రత్తపడడం వల్లే వీటి గుట్టు బయటపడడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అనామకులు, అనాథల మృతదేహాలు లభ్యమైనప్పుడు కుటుంబ సభ్యుల ఒత్తిడి లేకపోవడంతో దర్యాప్తులో కొంత నిర్లక్ష్యం జరుగుతుందని మరో అధికారి చెప్పారు.

ఈ ఏడాదిలో... ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధి బ్రాహ్మణపల్లి ఔటర్ రింగురోడ్డు సమీపంలో ఈ ఏడాది జనవరి 16న గోనె సంచిలో మృతదేహం లభ్యమైంది. నిందితులు ఎక్కడో చంపేసి ఔటర్ రింగురోడ్డు పక్కన విసిరేశారు. మరణించిన వ్యక్తి ఎవరో.. చంపిన వారెవరో ఇంతవరకు గుర్తించలేదు. నిర్మానుష్య ప్రాంతం కావడంతో సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలు లభించలేదు. దర్యాప్తు ఆగిపోయింది.

# పాతబస్తీ మెట్రోకి భూసేకరణ



హైదరాబాద్: పాతబస్తీ మెట్రోరైలు మార్గంలో ఆస్తుల సేకరణకు అయ్యే వ్యయం పెరగనుంది. గతంలో 80 అడుగులకే పరిమితం చేయాలనుకున్న రోడ్డు విస్తరణను మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులకు విస్తరించాలని నిర్ణయించడంతో సేకరించాల్సిన ఆస్తుల సంఖ్య పెరగనుంది. స్టేషన్లు ఏర్పాటు చేసే నాలుగు ప్రదేశాల్లో 120 అడుగులు ఉండేలా చూడనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మార్గంలో 1100 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని... ఇందుకు రూ.800 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా. పాతబస్తీ మెట్రోకి ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు. వీటిని మంజూరు చేస్తే భూసేకరణను మొదలెట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఇక్కడో చిక్కుంది. చాలావరకు పురాతన భవనాలు ఉన్నాయి. వాటి యజమానులు ఎవరనేది కచ్చితంగా తెలిస్తేనే పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోవడం సాధ్యం అవుతుంది. రికార్డుల ద్వారా యజమానులు ఎవరో గుర్తించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు మెట్రో అధికారులు లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఎంఆర్)లోనే భూసేకరణ విభాగం ఉంది. ఒక డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు తహసీల్దార్లు ఉన్నారు. భూసేకరణ పనులను వీరు చూడనున్నారు.

రహదారి విస్తరణ తర్వాతే పనులు

ఆస్తుల సేకరణ కొలిక్కి వచ్చాక అక్కడ ఉన్న విద్యుత్తు, భూగర్భ మంచినీటి, డ్రైన్ పైపుల వంటివి ఇతర చోట్లకు మారుస్తారు. అనంతరం 100 అడుగులకు రహదారిని విస్తరిస్తారు. అప్పుడే మెట్రో పనులకు రైట్ ఆఫ్ వే లభిస్తుంది. ఈ ప్రక్రియ అంత పూర్తయ్యేసరికి కనీసం ఏడాదైనా పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ వ్యయం రూ.2వేల కోట్లు కాబట్టి ప్రభుత్వంపై పెద్దగా భారం లేకుండా ఏడాదికి రూ.500 కోట్లు కేటాయిస్తే నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చు అంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో కేటాయించిన వాటిలో తొలుత రూ.200 కోట్లు ఇచ్చినా ఆస్తుల సేకరణ ప్రక్రియ మొదలెట్టవచ్చు.

అభ్యంతరాలు పెద్దగా ఉండకపోవచ్చు

గతంలో అభ్యంతర పెట్టిన మజ్లిస్ పార్టీ నేతలే.. ఇప్పుడు సీఎంతో కలిసి శంకుస్థాపన వేడుకల్లో పాల్గొన్నారు. ఆస్తుల సేకరణకు సంబంధించి వీరి సహకారం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కాబట్టి పాతబస్తీలో మెట్రో అలైన్‌మెంట్ కోసం ఆస్తుల సేకరణ పెద్ద సమస్య కాబోదని అంటున్నారు.

# సమస్య ఏదైనా.. పరిష్కారం చకచకా

హైదరాబాద్: క్రిస్మత్‌పూర్‌లో అదొక కమ్యూనిటీ. దాదాపుగా 100 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆరునెలలుగా తరచూ లోవోల్టేజీ, విద్యుత్తు అంతరాయాల సమస్యలు ఎదుర్కొంటోంది. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడే కారణమని సిబ్బంది గుర్తించినా.. సమస్య పరిష్కరించలేదు. అధికారులకు మొరపెట్టుకుంటే.. కిందిస్థాయి సిబ్బందికి చెప్పి వదిలేశారు. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచాలని ఆపరేషన్స్ డైరెక్టర్ ఆదేశించినా పని జరగలేదు. విసిగిపోయిన కమ్యూనిటీలోని ఒక వినియోగదారుడు నేరుగా సీఎండీ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. అధికారులు, సిబ్బందిపై ఆగ్రహించిన సీఎండీ వెంటనే మరో కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంటల వ్యవధిలో అక్కడ కొత్త నియంత్రికను ఏర్పాటు చేశారు. ఆ కమ్యూనిటీ సమస్యకు పరిష్కారం చూపారు. ఈ తరహాలోనే ఎల్ఐసీ కాలనీలో ఫీడర్ విభజన ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉంది. వాటిని సైతం ఇటీవల పరిష్కరించారు. చిన్నచిన్న సమస్యలను సైతం అలక్ష్యం చేస్తూ.. సిటీలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్తు సమస్యలను విద్యుత్తు పంపిణీ సంస్థ ఒక్కొక్కటిగా పరిష్కరించే ప్రయత్నం చేస్తోంది. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఫీడర్ విభజన, ఒరిగిన స్తంభాలు, లైన్లను సరిచేయడం వంటి చిన్న పనులను కూడా కొందరు సిబ్బంది అలక్ష్యం చేశారు. కొందరు అధికారులు మినహా అధికశాతం మంది క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చేవారు కాదు. ఇంజినీర్లు టెక్నికల్ అంశాలపై కాకుండా ఇతర విషయాలపైనే ఎక్కువ దృష్టిపెట్టేవారు. ఇప్పుడు సీఎండీ ప్రత్యేకంగా డీటీఆర్ స్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తుండటంతో ఫిర్యాదు రాగానే అధికారులు స్పందిస్తున్నారు.

# అర్హులైనా అందని గ్యాస్ రాయితీ


కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో గ్యాస్ కంపెనీలు నిబంధనలు పాటించకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నవారు రాయితీ రాకపోయేసరికి నగర, పుర పాలక, ఎంపీడీవోల కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. అధికారులు ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తే ఈకేవైసీ లేదని, గ్యాస్ యూనిక్ ఐడీ నంబరు లేదంటూ వెనక్కు పంపుతుండటంతో లబ్ధిదారులు ఏజెన్సీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి

జిల్లాలో ఉన్న 5,32,720 గ్యాస్ కనెక్షన్లలో 2,76,913 మంది మహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. 89 వేల దరఖాస్తుల్లో లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. లోపాల సవరణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు, కార్యదర్శులు, రిసోర్స్‌పర్సన్స్ (ఆర్పీ)లతో ఇంటింటికీ తిరుగుతూ చేపట్టారు. తీరా వినియోగదారులు గ్యాస్ బుక్ చేస్తే రాయితీ రావడం లేదు. స్థానిక అధికారులను ఆశ్రయించగా.. సదరు దరఖాస్తుల గ్యాస్ కనెక్షన్‌కు కేఈవైసీతో పాటు యూనిక్ ఐడీ నంబర్ లేకపోవడంతో రాయితీ రావడం లేదని తేలింది. గ్యాస్ ఏజెన్సీ, కంపెనీ అధికారుల పట్టింపులేని వైఖరి.. జిల్లా యంత్రాంగం ఉదాసీనతే దీనికి కారణం.

గుర్తింపు సంఖ్య ఏదీ?

వంటగ్యాస్ కంపెనీలు ప్రతి వినియోగదారుడికి 17 లేదా 19 అంకెల గుర్తింపు సంఖ్య (ఎల్పీజీ యూనిక్ ఐడీ)ని కేటాయిస్తారు. ప్రస్తుతం చాలా మంది వినియోగదారుల వద్ద ఈ సంఖ్య లేదు. దీని కోసం



గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగెత్తుతున్నారు. గ్యాస్ సరఫరా చేసే సమయంలో వినియోగదారుడి క్యాష్ బిల్లుపై కానీ, డొమెస్టిక్ గ్యాస్ కన్స్యూమర్ కార్డులో కానీ గుర్తింపు సంఖ్య నమోదు చేయడం లేదు. సుమారు 20 నుంచి 30 ఏళ్ల కింద గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వినియోగదారుల వద్ద కూడా యూనిక్ ఐడీ నంబరు లేదు. ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ చేసుకుంటున్న వినియోగదారుల యూనిక్ ఐడీ స్థానంలో సెల్‌నంబర్ ఉంటోంది. ఇది పూర్తిగా గ్యాస్ కంపెనీలు, సదరు ఏజెన్సీల నిర్లక్ష్యమేనని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఈకేవైసీ సమస్యలు

గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ బాయ్‌ల సహాయంతో ఇంటివద్దే ఈకేవైసీ సేకరిస్తామని చెప్పారు కానీ.. ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఈకేవైసీ లేని ఎల్పీజీ వినియోగదారుల మహాలక్ష్మి దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది. దీంతో వినియోగదారులు ఏజెన్సీలకు పరిగెత్తుతున్నారు. తీరా అక్కడకు వెళ్తే ఆధార్ అనుసంధానం లేదని, కుటుంబ సభ్యుల్లో మరొకరి ఆధార్‌తో అనుసంధానమై ఉందని చెబుతున్నారు. దీంతో ఆధార్ మార్చుకోవాలి లేదా కొత్త ఆధార్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనికి సమయం పట్టడంతో వినియోగదారులు నష్టపోతున్నారు.

మూడేళ్లుగా బిల్లులే లేవు

నగరంలోని గణేశ్‌నగర్‌లో ఓ కంపెనీకి చెందిన గ్యాస్ ఏజెన్సీ మూడేళ్లుగా వినియోగదారులకు గ్యాస్ బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో సదరు వినియోగదారుల మహాలక్ష్మి పథక దరఖాస్తు తిరస్కరణకు గురవుతోంది. నెలనెలా కొనుగోలు చేసిన గ్యాస్ బిల్లులు ఇవ్వకుండా ఎగవేసిన ఏజెన్సీ వద్దకు వెళ్లి తమ యూనిక్ ఐడీ నంబర్‌కు ప్రయత్నిస్తే కన్స్యూమర్ నంబరుకు సరిపోలడం లేదు. దీంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా ఏజెన్సీలు ఇష్టారీతిగా వ్యవహరిస్తుండగా పౌరసరఫరా శాఖాధికారులు పర్యవేక్షణ గాలికొదిలేశారు. వెరసి గృహలక్ష్మి లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.

# దిగువకు మానేరు!

కరీంనగర్ : కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలో నీరు అడుగంటుతోంది. నగరంతోపాటు గ్రామాలకు తాగునీటిని అందించేందుకు నగరపాలక, మిషన్ భగీరథ అధికారులు దీనిపై ఆధారపడ్డారు. డ్యాంల్లోంచి నీటి శుద్ధి కేంద్రాలకు రావాటర్ పంపింగ్ చేసుకొని, శుద్ధ జలాన్ని గొట్టపు మార్గం ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. నగరానికి ప్రతి రోజు సరఫరా చేయాల్సి ఉండగా, నెల రోజులుగా పలు ప్రాంతాలకు రోజు విడిచి పంపిణీ చేస్తున్నారు. నీటి నిల్వలు తగ్గిపోతుండటం, ఎస్సారెస్పీ, మధ్య మానేరు జలాశయాల్లో కూడా తగ్గడంతో వచ్చే మూడు నెలల్లో పరిస్థితి ఏమిటనే ఆందోళన అధికారుల్లో నెలకొంది.

డ్యాంలో ఆరు టీఎంసీలే..మానేరు డ్యాంలో ఆరు టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రతి రోజు దిగువకు 3,388 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా, 1,467 క్యూసెక్కుల నీరు మిడ్ మానేరు నుంచి వస్తోంది. అదనంగా 1,921 క్యూసెక్కుల నీరు మానేరు నుంచి వెళుతుండటంతో నీటి నిల్వలు పడిపోతున్నాయి. ఈ నీరంతా నల్గొండ, సూర్యాపేటకు వెళ్తున్నట్లు సమాచారం. వచ్చే ఆరు రోజుల్లో ఒక టీఎంసీ నీరు ఖాళీ అయితే.. డ్యాంలో అయిదు టీఎంసీలే మిగిలి ఉంటుంది. అందులో రెండు టీఎంసీలు డెడ్‌స్టోరేజీ, మూడు టీఎంసీల నీరు ఉండే అవకాశముంది. ఎలగందుల, సిద్దిపేట, నగరానికి తాగునీటికి కష్టాలు మొదలయ్యాయి. నగర పాలిక నీటిశుద్ధి కేంద్రానికి 65 ఎంఎల్‌డీల రావాటర్ రావాల్సి ఉండగా 53 ఎంఎల్‌డీలు వస్తుండటంతో సరిపోవడం లేదు. 8 టీఎంసీలు నిల్వ ఉంటే తప్ప రోజు సరఫరా చేయడం సాధ్యం కాదంటున్నారు. అసలే ఎండాకాలం, ఆపై నీరు లేకపోవడంతో నగర నీటి సరఫరాపై ప్రభావం పడేలా కనిపిస్తోంది. జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి డ్యాంలో కనీస నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కరవు

పెద్దపల్లి : ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఇటీవల పలు నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో చేరుతుండగా నిరుపేదలు గ్రంథాలయాలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు గ్రంథాలయాల్లో కనీస వసతులు కరవయ్యాయి. పుస్తకాలున్న చోట తెరచుకోకపోవడం, భవనాలున్నా సిబ్బంది లేకపోవడం తదితర కారణాలతో విజ్ఞానం అందని ద్రాక్షగానే మారింది. జిల్లాలోని పలు మండలాల్లో గ్రంథాలయాల పరిస్థితిపై పరిశీలనాత్మక కథనం.

జిల్లా గ్రంథాలయంతో పాటు తొమ్మిది మండలాల్లో శాఖ గ్రంథాలయాలున్నాయి. వీటిలో మంథని, సుల్తానాబాద్‌లో సొంత భవనాలుండగా మిగతా చోట్ల అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల్లో గ్రంథాలయాల ఏర్పాటు ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ఆయా మండలాల నిరుద్యోగులు పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

**100 మందికి రెండు గదులు**

పెద్దపల్లిలో జిల్లా శాఖ గ్రంథాలయం దూరదర్శన్ భవనంలో కొనసాగుతుండగా రెండు గదులు మాత్రమే పఠనానికి వీలుగా ఉన్నాయి. 50 మందికే సరిపోతున్నాయి. జూనియర్ అసిస్టెంట్, అటెండర్ అందుబాటులో ఉండగా ఇన్‌ఛార్జి కార్యదర్శి పర్యవేక్షిస్తున్నారు. 650 మంది పురుషులు, 373 మంది మహిళలు రూ.150 చొప్పున ధరావత్తు చెల్లించి సభ్యులుగా ఉన్నారు. నిత్యం 100 మంది వరకు సన్నద్ధమవుతుండగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సొంత భవనం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

**అపరిశుభ్రతతో దోమల బెడద**

మంథని: మంథని గ్రంథాలయానికి సొంత భవనం ఉండగా మంథని, మల్హర్, ముత్తారం మండలాల నిరుద్యోగులు వస్తున్నారు. మరుగుదొడ్డి లేదు. భవనం వెనుక వైపు ముళ్లపొదలుండటంతో దోమల బెడద అధికంగా ఉంది. గతేడాది పోటీ పరీక్షల పుస్తకాల కోసం విన్నవించగా పరీక్ష రోజునే వచ్చాయని, ఈ సారైనా ముందుగా పంపిణీ చేయాలని పాఠకులు కోరుతున్నారు.

**సమయపాలన ఏదీ!**

ఓదెలలో అద్దె భవనంలో కొనసాగుతుండగా ప్రతి రోజూ 10 మంది వరకు నిరుద్యోగులు వస్తున్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నా సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీంతో సాధన కోసం వచ్చిన నిరుద్యోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

**దిన పత్రికలకే పరిమితం**

మండల కేంద్రంలోని గ్రంథాలయం కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. ఆరేళ్లుగా గ్రంథపాలకుడు లేకపోవడంతో స్థానికంగా ఉండే వారితో నిర్వహిస్తున్నారు. దినపత్రికలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొన్ని పోటీ పరీక్షల పుస్తకాలున్నా ప్రస్తుత సిలబస్ లేదు. ఒకే గది ఉండటం, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో పాఠకులు రావడానికి ఆసక్తి చూపడం లేదు.

**సన్నద్ధతకు ఇబ్బందులు**

మండలకేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలోని ఇరుకు గదుల్లో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. మొదట తాత్కాలికమే అని చెప్పినా చాలా కాలంగా ఇక్కడే నిర్వహిస్తున్నారు. కుర్చీలు, బెంచీలున్నా గదులు ఇరుగ్గా ఉండటంతో పాఠకులు ఆసక్తి చూపడం లేదు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవు. వైఫై సౌకర్యం లేక సన్నద్ధతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**అరకొరగా పుస్తకాలు**

గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీ గ్రంథాలయానికి నిత్యం 50 మంది వరకు వస్తున్నారు. గతంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేయగా పాఠకుల సంఖ్య పెరగడంతో సరిపోవడం లేదు. బల్లలు, కుర్చీలు సరిపోక నిర్దేశిత సమయంలోనే రావాల్సి వస్తోంది. ఆవరణలో సింగరేణి సంస్థ ప్రయోగశాల డబ్బాలు పెట్టడంతో స్థలం ఇరుగ్గా మారింది. ప్రస్తుతం ఒకే కూలరు ఉండగా సరిపోవడం లేదని, దాతల సాయంతో మరిన్ని ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నారు. కొత్తగా వచ్చిన పాఠకులకు పుస్తకాలు పంపిణీ చేయాలని విన్నవిస్తున్నారు.

**శిథిల భవనంలోనే..** మండల కేంద్రంలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. ఇరుకు గదిలో నిర్వహిస్తుండటంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. సరిపడా పుస్తకాలున్నా కుర్చీలు లేకపోవడంతో పఠనంలో ఏకాగ్రత కుదరడం లేదు. కొన్ని కుర్చీలను బీరువాలపై వృథాగా పడేశారు. మౌలిక వసతులు లేకపోవడంతో పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి సాధన చేస్తున్నారు.

# ఆరు నెలలైనా ఆరంభమేదీ!

మంథని: మంథని ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రాక మూత్రపిండ వ్యాధిగ్రస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రక్తశుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి ఆరు నెలలు గడుస్తున్నా సేవలు ప్రారంభించడం లేదు.

మంథని సీమాంగ్ భవనంలో అయిదు పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. పడకలు, ఇతర సామగ్రిని సమకూర్చారు. అయితే రక్తశుద్ధి సేవలు ప్రారంభించడానికి ఆసుపత్రిలో ఉన్న విద్యుత్తు సరఫరా సామర్థ్యం సరిపోదు. ఎక్కువ లోడ్ అవసరం



ఉండటంతో అదనంగా విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆసుపత్రి అధికారులు విద్యుత్తు శాఖను కోరగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.8 లక్షలు చెల్లించాలని చెప్పారు. దీనిపై నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. నిధులు మంజూరు కాకపోవడంతో డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి రావడం లేదు. దీంతో ఆరు నెలలుగా పడకలు, సామగ్రి నిరుపయోగంగా మారింది. మరోవైపు కిడ్నీ వ్యాధిగ్రస్థులు రక్తశుద్ధి కోసం కరీంనగర్, హైదరాబాద్ నగరాలకు వెళ్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మంథని ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో అయిదు పడకలు, ఇతర వసతులతో పాటు ఆపరేటర్‌ను నియమించారు. టెక్నీషియన్లను నియమించి రక్తశుద్ధి సేవలు అందించాల్సి ఉన్నా విద్యుత్తు నియంత్రిక బిగించకపోవడంతో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మూత్రపిండ వ్యాధిగ్రస్థులు కోరుతున్నారు.

# శత శాతానికి పైగా..



బోయినపల్లి : స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తున్నారు. జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.442.94 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. మార్చి నెలాఖరు వరకు గడువు ఉన్నప్పటికి ముందుగానే జిల్లా రుణ లక్ష్యం పూర్తి చేశారు. కాగా అయిదు మండలాల్లో లక్ష్యానికి మించి రుణాలు అందించారు. మిగిలిన మండలాలు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి.

జిల్లాలో 7,626 స్వశక్తి సంఘాలు ఉన్నాయి. ఇందులో సుమారు లక్ష వరకు సభ్యులు ఉన్నారు. ప్రతి సంఘంలోని సభ్యులు ప్రతి నెలా బ్యాంకులో డబ్బులు పొదుపు చేస్తుంటారు. సంఘాల పొదుపు, పని తీరు ఆధారంగా బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేస్తున్నారు. ప్రతి సంఘానికి వారి అవసరం మేరకు, అర్హత ఆధారంగా రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు బ్యాంకు నుంచి రుణాలు అందిస్తున్నారు. రుణాలు పొందిన సభ్యులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తున్నారు. అధికంగా కుట్లు, అల్లికలు, వస్త్ర దుకాణం, కిరాణా, చిరువ్యాపారం, పేపర్ ప్లేట్ల తయారీ, పాడి ద్వారా ఆదాయం పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. తీసుకున్న రుణాలను ప్రతి నెలా క్రమం తప్పకుండా వడ్డీతో సహా బ్యాంకులో చెల్లిస్తున్నారు.

**గడువుకు ముందుగానే...**

జిల్లాలో 7,626 సంఘాలకు ఆర్థిక సంవత్సరంలో రూ.442.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాలని జిల్లా అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. ఈమేరకు ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులతో సమీక్షాసమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు గడువు ఉన్నప్పటికీ ముందుగానే లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఇప్పటి వరకు 6,110 సంఘాలకు రూ.452.85 కోట్ల రుణాలను అందించారు. బోయినపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్, వేములవాడ గ్రామీణ మండలాల్లో లక్ష్యానికి మించి అందజేశారు. వేములవాడ మండలంలో 97.19 శాతం, ఎల్లారెడ్డిపేట 93.97, చందుర్తి 94.29, తంగళ్లపల్లి 98.52, వీర్నపల్లి 82.47, రుద్రంగి 80 శాతం లక్ష్యం సాధించాయి. జిల్లా రుణ లక్ష్యానికి మించి రూ. 9.91 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించారు.

సద్వినియోగం చేసుకోవాలి స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలి. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం పూర్తయింది. మండలాల వారీగా ఎప్పటికప్పుడు రుణ లక్ష్యం చేరుకునే విధంగా సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి సూచనలు చేశాం. శేషాద్రి, డీఆర్డీవో

# జాప్యం నెలకొని... అంచనాలు పెరిగి



వేములవాడ : ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణంలోని మూలవాగులో 2015 సంవత్సరంలో రెండు వంతెనల నిర్మాణానికి, వాటి వద్ద కూడళ్ల అభివృద్ధికి అంచనాలు తయారు చేశారు. అప్పుడు చేసిన అంచనాలతో పనులు మొదలు పెట్టగా పడమర వైపు వంతెన నిర్మాణం పూర్తయింది. తూర్పు వైపు వంతెన పనులు ఆగిపోయాయి. ఏటా వర్షాలకు మూలవాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో నిర్మాణ పనులకు అడ్డంకిగా మారి జాప్యం నెలకొంటుంది. ఏళ్లు గడుస్తున్న కొద్దీ నిర్మాణ వ్యయం అంచనాలు పెరిగిపోతున్నాయి. దీంతో పాత అంచనాలతో చేయలేమని గుత్తేదారు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రోజూ వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. వీరికి రవాణా పరంగా అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వేములవాడ మూలవాగు పాత వంతెనకు ఇరువైపులా రెండు వంతెనల నిర్మాణంతో పాటు వాటి వద్ద కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టేందుకు 2015లో కోర్‌నెట్ నిధులు రూ. 28 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రెండు వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించి, పనులకు శ్రీకారం చుట్టారు. ఆధ్యాత్మికత ఉట్టి పడేలా వంతెనలు డిజైన్ చేయడంతో పాటు పాత వంతెనకు ఇరువైపులా 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో నిర్మించడానికి రూపకల్పన చేశారు. రెండు వంతెనల చివర కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. పడమటి వైపు పూర్తి చేసి దాదాపు అయిదేళ్లు అవుతున్నా తూర్పు వైపు వంతెన నిర్మాణ పనులు ఆగుతూ సాగుతూ వస్తున్నాయి. అయిదు పిల్లర్లకు గాను కేవలం మధ్యలో రెండు మాత్రమే పూర్తి చేశారు. రెండో వంతెన నిర్మాణం మొదలు పెట్టినప్పటి నుంచి ఒక్కసారి కూడా సజావుగా పనులు సాగిన దాఖలాలు లేవు. వంతెనకు ఇరువైపులా భూసేకరణ నేటికీ పూర్తి కాకపోవడం జాప్యానికి మరో కారణంగా అధికారులు చెబుతున్నారు. మొదటి నుంచి పిల్లర్లను నిర్మించాల్సి ఉండగా భూసేకరణ కాక వాగు మధ్యలో మొదలు పెట్టి రెండు పిల్లర్లను పూర్తి చేయడం గమనార్హం.

**మూడుసార్లు కొట్టుకుపోవడంతో...** రెండో వంతెన నిర్మాణానికి ఏటా అంతరాయం ఏర్పడుతోంది. సెంట్రింగ్ పనులు చేపట్టే దశలోనే భారీ వర్షాలకు సపోర్టు పైపులు కొట్టుకుపోయి మూడు సార్లు కూలిపోయింది. మొదట బీములపై స్లాబ్ వేసే దశలో సెప్టెంబరు 2019లో భారీ వర్షాలకు సెంట్రింగ్ సపోర్టు కర్రలు కొట్టుకుపోయి బీమ్ వంగిపోయి కూలింది. అప్పటి నుంచి భారీ వర్షాలకు బీమ్‌ల నిర్మాణాకి స్టీల్ అల్లుతున్న క్రమంలో సపోర్టు కర్రల అడుగు భాగంలో ఇసుక కొట్టుకుపోయి కుంగిపోవడం, కొట్టుకుపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో గుత్తేదారు నష్టాన్ని చవిచూశారు. ఈ వంతెన నిర్మాణం 2018లోనే పూర్తి కావాల్సి ఉంది. అధికారుల్లో ముందు చూపు లేక, గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల నేటికీ పూర్తి కాని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గుత్తేదారు ముందుకు రావడం లేదు నిర్మాణ వ్యయం పెరిగిపోవడంతో పాత అంచనాలతో పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడం లేదు. వంతెనలకు ఇరువైపులా భూసేకరణ కూడా పూర్తి కాలేదు. వంతెన బ్యాలెన్స్ అంచనాలతో తిరిగి టెండర్లు పిలిచి పనులు చేపట్టే ప్రక్రియకు చర్యలు తీసుకుంటున్నాం.- శాంతయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, వేములవాడ

# సార్వత్రిక పోరుకు సన్నద్ధత షురూ

పెద్దపల్లి : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ సజావుగా చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఓటర్లకు దూర భారం తగ్గించేందుకు కొత్తగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మరోవైపు అర్హులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకొనేలా చైతన్యం కల్పిస్తున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే పెద్దపల్లి నియోజకవర్గంలో అదనంగా లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు రామగిరి మండలం సెంటినరీకాలనీ ఇంజినీరింగ్ కళాశాలలో మాత్రమే ఓట్లు లెక్కించేవారు. ఈసారి మంచిర్యాల జిల్లాలోనూ కేంద్రం ఏర్పాటుకు ఎన్నికల సంఘం అనుమతినిచ్చింది.

కొత్తగా 2 పోలింగ్ కేంద్రాలు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటం వల్ల చాలా మంది ఓటు వేయడానికి నిరాసక్తత కనబరుస్తున్నారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా 2 కి.మీ.ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలను అధికారులు సేకరించారు. పల్లె, పట్టణాల్లోని కేంద్రాల దూరాన్ని బట్టి కొత్తవి ఏర్పాటుకు ప్రతిపాదించారు. జిల్లాలోని రామగుండం, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో 838 పోలింగ్ కేంద్రాలుండగా ప్రస్తుతం కొత్తగా రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముత్తారం మండలం శాత్రాజ్‌పల్లి, పాలకుర్తి మండలం బామ్లానాయక్‌తండా కేంద్రాలతో కలిపి వాటి సంఖ్య 840కు చేరింది. రామగుండంలో 260, మంథనిలో 290, పెద్దపల్లిలో 290 చొప్పున కేంద్రాలున్నాయి.

**రెండు చోట్ల లెక్కింపు**

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం అయిదు జిల్లాల్లో విస్తరించింది. పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని, జగిత్యాల జిల్లా ధర్మపురి, మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మల్హర్, కాటారం, మహాముత్తారం, పలిమెల, మహాదేవపూర్ మండలాలున్నాయి. మొత్తం 15,92,996 మంది ఓటర్లలో 7,87,140 మంది పురుషులు, 8,05,755 మంది మహిళలు, 101 మంది ఇతరులున్నారు.

# షట్టర్ల తొలగింపు.. అందని సాగునీరు

మల్లాపూర్ : శ్రీరామసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కాల్వలో ప్రస్తుతం వారబందీ పద్ధతిలో నీటి సరఫరా కొనసాగుతున్నప్పటికీ డి-29 ప్రధాన కాల్వలో గతంలో ఏర్పాటు చేసిన షట్టర్లను పై భాగంలో ఉన్న గ్రామాల రైతులు తొలగిస్తున్నారు. దీంతో ఆయకట్టు పరిధిలోని చివరి గ్రామాల రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కాల్వల చివరి గ్రామాల్లోని ఆయకట్టుకు నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల్లోని పలు గ్రామాలకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాల్వలోని డి-29 ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. మెట్‌పల్లి మండలం సింగరావుపేట, రేగుంట, వెంపేట, ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌తో పాటు మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట, రాఘవపేట, చిట్టాపూర్, సిరిపూర్‌తో పాటు మరో 12 గ్రామాలకు సాగునీటి సరఫరా జరగుతోంది. పదేళ్లుగా ఆయా గ్రామాల్లోని కొంతమంది రైతులు పిల్ల కాల్వల వద్ద ఏర్పాటు చేసిన షట్టర్లు(తలుపులు)ను ధ్వంసం చేయడంతో పాటు మరికొన్ని చోట్ల పూర్తిగా తొలగించడంతో నీరంతా ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలకు చేరుకుని అక్కడి నుంచి వాగులు, గోదావరిలో కలిసి



వృథాగా పోతున్నాయి. దీంతో ఆయకట్టు చివరి గ్రామాలైన వెంపల్లి, వెంకట్రావుపేట, గొర్రెపల్లి, వాల్గొండ, మల్లాపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, పాత, కొత్తదాంరాజుపల్లి, సంగెం, శ్రీరాంపూర్, ఒబులాపూర్ గ్రామాల్లోని పంటలకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. తొలగించిన షట్టర్లను తిరిగి బిగించాలని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదు. రెండు సంవత్సరాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాల్వలకు గండ్లు పడటం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. అధికారులు స్పందించి డి-29 కాల్వ పైభాగంలో ఉన్న పిల్ల కాల్వలకు షట్టర్లను అమర్చి చివరి ఆయకట్టు రైతులకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# బీటీపీఎస్‌కు ఆది నుంచి సవాళ్లే..!


మణుగూరు : రాష్ట్ర విద్యుత్తు అవసరాల కోసం నిర్మించిన భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి ఆది నుంచి సవాళ్లే ఎదురవుతున్నాయి. నిర్మాణం సమయంలో అవాంతరాలు ఎదురయితే.. పూర్తి స్థాయి విద్యుదుత్పత్తి తరుణంలో తాజాగా విచారణకు సిద్ధమైంది. పట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలో ప్లాంటు ఏర్పాటుపై న్యాయ విచారణ చేయించాలని ఈనెల 12న రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. మణుగూరులో 1,080 మెగావాట్ల విద్యుదుత్పత్తి కోసం సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో బీటీపీఎస్ ప్లాంట్ నిర్మించిన విషయం తెలిసిందే. అయితే ప్లాంట్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. న్యాయ విచారణ నేపథ్యంలో బీటీపీఎస్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో ఒక్కో యూనిట్ విద్యుదుత్పత్తికి భారమవుతుందని ప్రభుత్వం పలుమార్లు పేర్కొనడం గమనార్హం.

**తొలుత పర్యావరణ అనుమతుల పేరున**

బీటీపీఎస్ నిర్మాణం 2015లో మొదలైంది. భూ సేకరణకు పరిహారం చెల్లింపు, నిర్మాణ సమయంలో వర్షాలు ఏకధాటిగా కురవటంతో పనులు నెమ్మదించాయి. 2017లో బీటీపీఎస్ నిర్మాణంపై ఎన్జీటీలో కేసు వేయడంతో 17 నెలలపాటు పనులు జరగలేదు. పనులు పునఃప్రారంభం అయ్యే సమయానికి కొవిడ్ ఆరంభమైంది. కార్మికులు సొంత ప్రాంతాలకు వెళ్లడంతో పనులు వేగంగా జరగలేదు.

**ఆలస్యంగా సీఓడీ..**

బీటీపీఎస్ నిర్మాణం జాప్యమవటంతో నాలుగు యూనిట్ల



సీఓడీ(కమర్షియల్ ఆపరేషన్ డే) నిర్వహణకు అదనపు సమయం పట్టింది. పనులు ప్రారంభించిన ఐదేళ్ల తరువాత మొదటి యూనిట్ సీఓడీ పూర్తయ్యింది. మిగిలిన మూడు యూనిట్ల సీఓడీని 2022 నాటికి పూర్తి చేశారు. 2020 జూన్ 5న యూనిట్-1 సీఓడీ, అదే ఏడాది డిసెంబర్ 7న యూనిట్-2 సీఓడీ, 2021 మార్చి 26న యూనిట్-3 సీఓడీ, 2022 జనవరి 9న యూనిట్ 4 సీఓడీ పూర్తయ్యింది.

బీటీపీఎస్ నిర్మాణ వ్యయం అంచనా: రూ.10,515 కోట్లు

చేసిన ఖర్చు: రూ.8,295 కోట్లు

ఒక యూనిట్ విద్యుత్తు తయారీకి అయ్యే ఖర్చు: రూ.9.74

సేరించిన భూమి: 1,179 ఎకరాలు

పూర్తికావాల్సిన పనులు:

18 కి.మీ రైలు మార్గం

వ్యాగన్ టిప్లర్ నీ ట్రాక్ హార్పర్

స్టాకర్ కమ్ రిక్లైనర్

కాలుష్యాన్ని నియంత్రించేందుకు నిర్మించే ఎఫ్జీడీ పనులు 30 శాతం మాత్రమే జరిగాయి.

# ఈడీ కస్టడీలో కవిత షెడ్యూల్ ఇదే..!



ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత ఈడీ కస్టడీలో ఉన్నారు. ఈనెల 15వ తేదీన కవితను హైదరాబాద్‌లోని తన నివాసంలో ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ఢిల్లీ తరలించారు. మార్చి 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చగా.. ఆమెను ఈనెల 23 వరకు ఈడీ కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో వారం రోజులుగా కవిత ఢిల్లీలోని ఈడీ కస్టడీలో ఉంటున్నారు. రేపటితో ఆమె ఈడీ కస్టడీ ముగియనుంది. దీంతో మళ్లీ కస్టడీకి కోరతారా.. లేదా జ్యూడిషియల్ రిమాండ్‌కు కవితను తరలిస్తారా అనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఈడీ కస్టడీలో కవిత దినచర్య ఎలా ఉందనే దానిపై పలు కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం కవిత రోజువారి దినచర్య ఈ విధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**రోజువారీ షెడ్యూల్ ఇదే..!**ఉదయం 5 గంటలకు లేచిన తర్వాత కొద్దిసేపు వ్యాయామం, ఉదయం 6 గంటలకు పేపర్, బుక్స్ రీడింగ్, ఉదయం 8 గంటలకు టిఫిన్ (ఇంటి నుంచి), ఉదయం 10 నుంచి సాయంత్రం 5- ఈడీ విచారణ (మధ్యలో ఒక గంట లంచ్ విరామం), సాయంత్రం 5.30 గంటలకు టీ, పాలు, స్నాక్స్, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు కుటుంబ సభ్యుల ములాఖత్, రాత్రి 8 గంటలకు భోజనం, భోజన విరామం తరువాత కవిత కొంత సేపు పుస్తకాలను చదవుతున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత నిద్ర పోతున్నట్లు సమాచారం. ఆమె కోరిక మేరకు కవితకు ఈడీ అధికారులు కొన్ని పుస్తకాలు అందజేసినట్లు తెలుస్తోంది. ఉదయం సమయంలో వార్తా పత్రికలను కవిత చదువుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ పరిస్థితులను న్యూస్ పేపర్స్ చదవి తెలుసుకుంటున్నట్లు తెలుస్తోంది. కవిత ఈడీ కస్టడీ రేపటితో ముగియనుంది. 6 నుంచి 7 గంటల వరకు కుటుంబ సభ్యులను కలిసేందుకు అనుమతి లభించింది. ఈడీ కస్టడీలో ఉన్న కవితను 8 మంది కలవొచ్చు. వారిలో తల్లి శోభా, కుమారులు ఆదిత్య, ఆర్యతో పాటు కుటుంబ సభ్యులను కలిసేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది.

# ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆయన ఎన్నికను రద్దు చేయాలంటూ భారాస నేత విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సుంకర నరేశ్ వాదనలు వినిపించారు. ఎన్నికల్లో ఓటర్లను దానం నాగేందర్ ప్రలోభపెట్టారని కోర్టుకు ఆయన తెలిపారు.

డబ్బులు పంచడంతో పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఆయన సతీమణి పేరు మీద ఉన్న ఆస్తుల వివరాలను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 18కి వాయిదా వేసింది.

# కవిత అరెస్టు కక్ష సాధింపే: బీఆర్ఎస్ ఎంపీలు



ఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఎంపీలు మండిపడ్డారు. పార్టీ ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, సురేష్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్ ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రాంతీయ పార్టీలను దెబ్బ కొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, ఇందులో భాగంగానే లోక్‌సభ ఎన్నికల ముందు కవిత అరెస్టు జరిగిందన్నారు. నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ తమను సరెండర్ చేసుకునేందుకే ఇలాంటి దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలను దెబ్బకొట్టాలనే అనే ఆలోచన ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. ఎంపీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలను అరెస్టు చేయడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ పార్టీని చీల్చేందుకు ఉద్యమ సమయంలో కూడా ఇవే ప్రయత్నాలు చేశారన్నారు. వీటన్నింటినీ ఎదుర్కొని తెలంగాణ సాధించామని, ఇప్పుడు కూడా కేసుల నుంచి క్లీన్‌గా బయటపడతామని చెప్పారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కవిత బాధితురాలే తప్ప, నిందితురాలు కాదన్నారు. ఆమె కడిగిన ముత్యంలా ఈ కేసు నుంచి బయటపడతారన్నారు.

ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కవితను అరెస్ట్ చేశారన్నారు. బీజేపీ చర్యలను ప్రజలు ఎన్నికల్లో తిప్పి కొట్టడం ఖాయమన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులను దొంగల్లా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు.

# వారిని వదిలి పెట్టం... పల్లా రాజేశ్వర్ రెడ్డి హాట్ కామెంట్స్

హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి వేరే పార్టీలోకి వెళ్లేవారిని వదిలిపెట్టేది లేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. పార్టీ మారే నేతలు పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని చెప్పారు. పార్టీ మారిన నేతలని ప్రజలు చెప్పులతో కొడతారని వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంపీ అభ్యర్థులు లేక తమ పార్టీ నేతల వెంట పడుతున్నారని మండిపడ్డారు. కొందరు పిరికి పందలు పార్టీ మారుతున్నారని ధ్వజమెత్తారు. స్వలాభం కోసం రాజకీయాలను భ్రష్టు పట్టించిన నేతలు ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం శోచనీయమని అన్నారు. అక్రమాలు చేసిన వారు పార్టీ మారితే వారి అక్రమాలను బీఆర్ఎస్సే బయట పెడుతుందని హెచ్చరించారు.

**రైతు బంధు నిధులు ఏమయ్యాయి..?** అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు భరోసా కల్పించకుండా గత కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. గత ప్రభుత్వంలో అంచనాలు వేసి వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వంలో రైతు బంధు నిధులను త్వరగా రైతుల ఖాతాల్లో వేశామని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులకు డబ్బులు ఇవ్వలేదని అన్నారు. తాము రైతు బంధు కోసం సిద్ధంగా ఉంచిన నిధులు ఏ కాంట్రాక్టర్‌కు ఇచ్చారో తెలుసునని చెప్పారు. 9 నెలల్లో తాము భక్త రామదాసు ప్రాజెక్ట్ కట్టింది వాస్తవమా కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. వెంటనే రెండు లక్షల రైతు రుణమాఫీ, వరికి రూ. 500 బోనస్ ఇవ్వాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194





## జగిత్యాలలో డ్రగ్స్ కలకలం.. ఓ విద్యార్థిని వింత ప్రవర్తనతో విస్తుపోయే నిజాలు వెలుగులోకి..

యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్‌ని అంతమొందించేందుకు ప్రభుత్వ యంత్రాంగాలు ఎన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నా.. డ్రగ్స్ వినియోగం అంతకంతకూ వ్యాపిస్తూనే ఉంది. కొన్ని ముఠాలు రహస్యంగా ఈ చీకటి దందాని నడిపిస్తూనే ఉన్నాయి. తమ జేబులు నింపుకోవడం కోసం విద్యార్థుల జీవితాలతో డ్రగ్స్ ముఠాలు చెలగాటమాడుతున్నాయి. వారిని మత్తుకి బానిసలు చేసి జీవితాలను నాశనం చేస్తున్నాయి. చివరికి మైనర్లను సైతం మత్తుకు బానిసలుగా మార్చుతున్నాయి. మాయమాటలతో పిల్లలను డ్రగ్ రాకెట్‌లోకి లాగి, వారి చేత అసభ్యకరమైన పనులకు పాల్పడేలా పురిగొల్పుతున్నాయి. ఇలాంటి షాకింగ్ ఘటన తాజాగా జగిత్యాలలో వెలుగు చూసింది. ఓ తండ్రి చేసిన ఫిర్యాదుతో ఒళ్లు గగుర్పొడిచే ఈ డ్రగ్స్ బాగోతం బయటపడింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని కొన్ని రోజుల నుంచి వింతవింతగా ప్రవర్తించడం మొదలుపెట్టింది. మొదట్లో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు అంతగా ఖాతరు చేయలేదు. అయితే.. ఈమధ్య అమ్మాయి మరింత విచిత్రంగా వ్యవహరిస్తుండటంతో తండ్రికి అనుమానం వచ్చింది. ఎందుకిలా ప్రవర్తిస్తోందని ఆరాతీయగా.. ఆమె గంజాయికి అలవాటు పడిందని తండ్రికి తెలిసింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన శిశు సంరక్షణ కమిటీ.. వెంటనే దర్యాప్తు చేపట్టింది. ఈ విచారణలో భాగంగానే మరిన్ని విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఆ అమ్మాయితో పాటు పదో తరగతి చదువుతున్న ఇతర విద్యార్థినులు సైతం మత్తుకు బానిసైనట్లు తేలింది. మొత్తం 10 మంది బాలికలు గంజాయికి బానిసైనట్లు తెలిసింది. అసలు ఈ అమ్మాయిలకు ఎక్కడి నుంచి గంజాయి అందిందని మరింత లోతుగా విచారించగా.. దీని వెనుక ఓ సెక్స్ రాకెట్ ముఠా ఉన్నట్టు వెలుగులోకొచ్చింది. ఆ బాలికలను గంజాయికి బానిసలను చేయడమే కాదు.. వారిని హైదరాబాద్‌లోని రేవ్ పార్టీలకు కూడా తరలిస్తున్నట్టు వెల్లడైంది. అలా తరలించినందుకు గాను.. ప్రతి పార్టీకి రూ.30 వేలు ఆ ముఠాకు అందుతున్నట్టు తెలిసింది. ఈ తరుణంలోనే నార్కొటిక్ బ్యూరో అధికారులు రంగంలోకి దిగారు. సెక్స్ రాకెట్ ముఠాపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సూత్రధారులు ఎవరనే విషయంపై ఆరా తీస్తున్నారు. మరోవైపు.. మత్తుకు బానిసైన విద్యార్థినులను స్వధార్ హోంకు తరలించారు. ఈ ఘటనతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లల ఈ పరిస్థితికి కారణమైన వారిని శిక్షించాలని కోరుతున్నారు.

# ఎన్నిక రద్దు పిటిషన్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: అలంపూర్( జోగులాంబ గద్వాల) బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విజయుడి ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ బీఎస్పీ అభ్యర్థి ఆర్.ప్రసన్నకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు. ప్రసన్న కుమార్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ పదవికి విజయుడు రాజీనామా చేయకుండానే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని పేర్కొన్నారు. తన వృత్తికి సంబంధించిన వివరాలను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదన్నారు. రాజీనామా లేఖను, దానికి లభించిన ఆమోదం తదితర ఆధారాలు సమర్పించలేదన్నారు. నిబంధనల ప్రకారం నామినేషన్‌కు మూడు నెలల ముందు రాజీనామా సమర్పించాల్సి ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఎన్నికపై వివరణ ఇవ్వాలంటూ విజయుడికి నోటీసులు జారీ చేస్తూ విచారణను ఏప్రిల్ 18వ తేదీకి వాయిదా వేశారు. ఎన్నికలకు ముందు సైతం ప్రసన్నకుమార్ ఇదే అంశంపై పిటిషన్ దాఖలు చేసినా, ఎన్నికల నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించిన విషయం విదితమే. విజయుడు బీఆర్ఎస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి.. 2023 శాసనసభ ఎన్నికల్లో అలంపూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్‌పై 30,573 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

# షాకింగ్ న్యూస్.. హైదరాబాద్‌లో రూ.9 కోట్లు విలువైన డ్రగ్స్ పట్టివేత



హైదరాబాద్, మార్చి 22: ఇటీవల కాలంలో నిషేధిత డ్రగ్స్ సరఫరాపై డ్రంగ్ కంట్రోల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేసిన అధికారులు నకిలీ మందులు తయారు చేస్తూ విక్రయిస్తున్న గోడౌన్‌లపై దాడులు నిర్వహించి మందులను సీజ్ చేస్తున్నారు. తాజాగా నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తున్న కంపెనీపై డ్రంగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్ శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. దాదాపు 9 కోట్ల రూపాయల విలువు చేసే డ్రగ్స్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం పరుచుకున్నారు. బొల్లారంలోని ఫ్యాక్టరీలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లుగా ఇంటర్ పోల్ సమాచారం అందింది. వెంటనే ఇంటర్ పోల్ సహాయంతో పీఎస్ఎన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో డ్రగ్ కంట్రోల్ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో కంపెనీలో నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. దాదాపు 90 కిలోల మెపీడ్రిన్ డ్రగ్స్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత పది సంవత్సరాల నుంచి డ్రగ్స్ తయారు చేసి విదేశాలకి తరలిస్తున్న కస్తూరి రెడ్డి నల్లపొడిని అరెస్ట్ చేశారు. సిగరెట్ ప్యాకెట్లలో డ్రగ్స్‌ను పెట్టి విదేశాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. కొంత వరకు హైదరాబాదులో కూడా డ్రగ్స్ సప్లై చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రగ్స్ పట్టుబడటంపై డ్రగ్ కంట్రోల్ అధికారి కమలహాసన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంటర్ పోల్ సహాయంతో డ్రగ్స్ రాకెట్టు గుట్టురట్టు చేశామని తెలిపారు. పీఎస్ఎన్ కంపెనీ పలు దేశాలకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లుగా సమాచారం ఉందని కమలహాసన్ రెడ్డి వెల్లడించారు.




# బండి ఎంకరేజ్.. కిషన్ రెడ్డి మౌనం.. బీజేపీలో 'రజాకార్' పంచాయతీ

హైదరాబాద్, మార్చి 22: భారత్ జనతా పార్టీ (బీజేపీ)లో "రజాకార్" సినిమా పంచాయితీ నెలకొంది. రజాకార్ సినిమా విషయంలో కమలం పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయిన పరిస్థితి. రజాకార్ సినిమాను చూడాలని బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఎంకరేజ్ చేశారు. చెప్పడమే కాకుండా కరీంనగర్‌లో స్వయంగా థియేటర్‌కు వెళ్లి మరీ రజాకార్ సినిమాను ఎంపీ చూశారు.

అయితే రజాకార్ సినిమా విషయంలో రాష్ట్ర పార్టీ అధినేత కిషన్ రెడ్డి సైలెంట్‌గా ఉండిపోయారు.

**నిర్మాత ఆవేదన...** గతంలో కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ సినిమాలను కిషన్ రెడ్డి, ఇతర నేతలు స్వయంగా థియేటర్‌కు వెళ్ళి చూశారు. అయితే రజాకార్ సినిమా విషయంలో మాత్రం అధ్యక్షుడు కిషన్ రెడ్డి వర్గం మౌనం వహిస్తోంది. రజాకార్ సినిమాను పార్టీ క్యాడర్ చూసేలా.. పిలుపునివ్వాలని పార్టీకి బండి సంజయ్ సలహా ఇచ్చినట్లు సమాచారం. అయితే తన సినిమాకు పార్టీ నుంచి మద్దతు లేదన్న అసంతృప్తిలో నిర్మాత, బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ నాయకత్వం నుంచి కనీస మద్దతు లేదని గూడూరు నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రజకార్ సినిమా విషయంలో ఒక వర్గం ఎంకరేజ్ చేస్తుంటే.. మరోవర్గం వెనక్కి లాగుతోందని బీబేపీలో జోరుగా చర్చ వినిపిస్తోంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660